



కె.వి.సుమలత

# బొమ్మగారి బొమ్మ

వరలక్ష్మీవ్రతాలు, పెళ్లి సీజను వెరసి శ్రావణమాసం అంటేనే బట్టల షాపుల వారికి అత్యంత ప్రీతికరమైన మాసం. అన్ని షాపులు జనంతో క్రిక్కిరిసి పోయి ఉన్నాయి.

ఉమానందం, అతని భార్య, ముగ్గురు పిల్లలు, ఉమానందం చెల్లెళ్లు ఇద్దరు బావమరుదులు అందరూ కలిసి రద్దీగా ఉన్న ఒక షాపులోకి వెళ్లారు. ఉమానందం పెద్దకూతురు సురేఖ పెళ్లి బట్టలు కొనడానికి వచ్చారంతా.

దాదాపు నాలుగు గంటల అనంతరం షాపులో నుండి బయటకు వచ్చారు. అందరి ముఖాల్లోను అలసట.

కూల్‌డ్రింక్స్ తాగుదామని రోడ్డుకిరువైపులా డ్రింక్స్ షాపు కోసం చూస్తూ నడుస్తున్నారు.

ఉమానందం చిన్నకూతురు సుజాత నడుస్తున్నదల్లా ఆగిపోయింది. ఆమె చూపులు 'గిఫ్ట్ కార్నర్' గ్లాస్ డోర్ వెనుకనున్న 'పెళ్లికూతురు బొమ్మ' మీద ఆగిపోయాయి.

సుజాత తమతో రాకుండా ఆగిపోవడం గమనించి ఉమానందం వెనుతిరిగి వచ్చాడు.

"ఏమిటి రా? ఏం చూస్తున్నావు?" అడిగాడు ఉమానందం. వేలెత్తి బొమ్మ వంకకు చూపించింది సుజాత.

"బొమ్మ కావాలా?" అడిగాడు.

ఆనందంగా తలాడించి తండ్రి చెయ్యి పట్టుకుంది వెళ్దామని. వీళ్లిద్దరూ ఇంకా రాకుండా ఆగిపోవడం చూసి ఉమానందం చెల్లెళ్లిద్దరూ వీళ్ల దగ్గరకు వచ్చారు.

"ఏమిటట అన్నయ్యా" అడిగింది ఒక చెల్లి.

"ఏమీ లేదు. మీరు నడుస్తుండండి. సుజాతకు బొమ్మ కావాలంట. కొనుక్కుని మేము వస్తాం."

"పదవ తరగతి చదువుతుంది. దానికి బొమ్మ లేంటి?" అంటూ సుజాత వైపు తిరిగి "అంత పెద్ద బొమ్మ ఊరికినే వస్తుందంటే? హీనంగా ఐదారొంద లుంటుంది. మీ నాన్నకు ఉన్న ఖర్చు చాలదా" అంటూ కసురుకుంది ఉమానందం చెల్లెలు.

మేనత్త మాటలకు బేలగా తండ్రి వైపు చూసింది సుజాత.

సుజాత నిదానస్తురాలు. ఏదీ నోరు తెరచి గబుక్కున అడుగదు. మనసు గ్రహించి ఇస్తేనే తీసుకుంటుంది.

సుజాతను చూసిన ఉమానందం "పిచ్చితల్లీ, తరువాత నీకు నేను ఆ బొమ్మ తప్పకుండా కొనిపెడతానమ్మా" అని దగ్గరకు తీసుకున్నాడు.

సరేనని మౌనంగా తలాడించి వాళ్ల వెనుక తను చూసిన మీటరు పొడవున్న పెళ్లికూతురు బొమ్మను తలుచుకుంటూ నడిచింది.

పదవ తరగతి ఫస్ట్‌క్లాస్‌లో పాసయినపుడు తండ్రి చేసిన వాగ్దానం నెరవేర్చుకుంటాడేమోనని ఆశగా ఎదురుచూసింది. ఉమానందం పెద్దకూతురి శ్రీమంతపు ఖర్చులతో మునిగి ఉండడంతో చిన్నకూతురి కోరిక గుర్తొచ్చినా రానట్లే ఉండిపోయాడు.

ఇంటర్ పరీక్షా ఫలితాలు వచ్చినపుడు సుజాతను "ఎప్పుడూ ఏమీ అడుగవు మరదలా! ఏం కావాలో అడుగు కొనిపెడతాను" అన్నాడు సురేఖ భర్త.

బావగారి మాటలకు సుజాత మనసులో కోరిక పురి విప్పింది. "అడగవే. మొహమాటపడకు" అంటూ అక్క వత్తాసు పలికింది.

కాస్త మొహమాటపడుతూనే "నాకు బొమ్మ కావాలి" అంది.

"ఏం బొమ్మ?" అన్నాడు సురేఖ భర్త.

"పెళ్లికూతురు బొమ్మ."

అక్కడున్న వారంతా ఫక్కుమని నవ్వారు.

"అది అలాగే అంటుంది. పెళ్లి కావల్సిన పిల్ల. మంచి చీర కొని పెట్టండి" అంది సురేఖ.

అలా మరోసారి తొంగి చూసిన కోరిక మూలకు వెళ్లిపోయింది.

ఉమానందం రెండవ కూతురి బాధ్యత కూడా తీర్చుకున్నాడు. డిగ్రీ చదువుతున్న సుజాతకు రెండవ అల్లుడి ద్వారా మంచి సంబంధం రావడంతో ఆలోచించకుండా వివాహం జరిపించేశాడు ఉమానందం.

నగటు మధ్యతరగతి కుటుంబం నుండి సుజాత మరో మధ్యతరగతి కుటుంబానికి బాధ్యతాయుతమైన కోడలి స్థానంలోకి బదిలీ అయింది. సుజాత భర్త సుందర్ మున్సిపల్ ఆఫీసులో క్లర్కుగా పనిచేస్తున్నాడు. ఎటువంటి దురలవాట్లు లేవు. బుద్ధిమంతుడు. తండ్రి చిన్న వయసులోనే చనిపోయాడు. తల్లి, ఇద్దరు చెల్లెళ్ల బాధ్యత అతని మీదే ఉంది.

సుందర్ భార్యతో తన కష్టసుఖాలన్నీ ఏకరువు పెట్టుకున్నాడు. చెల్లెళ్ల భారం తన మీద నుండి దిగేదాకా నువ్వు నాకు సహకరించాలి అని వేడుకున్నాడు. అలాగేనంటూ అతని చేతిలో చేయి వేసి అతడి బాధ్యతలలో పాల్పంచుకుంది.

పెళ్లయిన కొంత కాలానికి సుందర్‌కి ఎల్.డి.సి. నుండి యు.డి.సి.గా ప్రమోషన్ వచ్చింది.

సుందర్ "ఇదంతా నీవు నా జీవితంలోకి అడుగుపెట్టిన వేళా విశేషమేనోయ్" అంటూ సుజాతను చుట్టేశాడు.

సుజాత ఆనందంగా మురిసిపోయింది.

"అన్నయ్యా ఈ సందర్భంగా మాకు కావల్సినవి ఇదుగో" అంటూ కోరికల లిస్ట్ పేపర్ మీద రాసి సుందర్ చేతికిచ్చారు.

"నీకేం కావాలోయ్" అని సుజాత నడిగాడు సుందర్.

సిగ్గుపడుతూనే "నాకు పెళ్లికూతురు బొమ్మ కావాలి" అంది.

"బొమ్మా?! ఇండైరెక్ట్‌గా పాపాయి కావాలని అడుగుతున్నావా? నీ మనసు నాకర్థమయింది. నా బాధ్యతలతో నిన్ను బాధపెడుతున్నాను. ఇక మనమెలాంటి ఫ్యామిలీ ప్లానింగ్ పాటించనవసరం లేదు" అంటూ ఎక్కడికో వెళ్లిపోయాడు ఏదేదో ఊహించుకుంటూ.

"అది కాదు" అంటూ వారించబోయిన సుజాత మాటలను సుందర్ వినిపించుకోలేదు.

తల్లికి, సుజాతకు పట్టుచీరలు తీసుకుని, చెల్లెళ్లు కోరినవి తెచ్చాడు సుందర్. మనసులో కోరికను అణచి

వేసి చిరునవ్వుతో వాటిని అందుకుంది సుజాత.

సుందర్ అన్నట్లుగానే మరికొద్దికాలానికి సుజాత నెల తప్పింది. తొమ్మిదవ నెల నిండుతుండగా సూడిదలిచ్చి తీసుకు వెళ్లడానికి ఉమానందం దంపతులు వచ్చారు.

పేరంటానికి వచ్చిన అమ్మలక్కలు సుజాతతో "మనసులో ఏదయినా కోరిక ఉంటే నెరవేర్చుకో. లేకపోతే కాన్పు కష్టమవుతుంది" అన్నారు.

ఆ మాటలు సుందర్ విన్నాడు కాబోలు. అందరూ వెళ్లిపోయాక సుజాతతో "నీ మనసులో ఉన్నది ఏదయినా సరే అడుగు. నా శాయశక్తులా తీర్చడానికే ప్రయత్నిస్తాను. ఎలాంటిదయినా సంశయించకు" అన్నాడు.

"ఏమీ అనుకోరుగా" అంది సుజాత.

"నిస్సందేహంగా అడుగు."

"నాకు ఒక పెళ్లికూతురు బొమ్మ కావాలి" అంటూ మొదలుపెట్టింది చెప్పడం.


అంతలోనే "అమ్మా" అంటూ పొట్టచేత బట్టుకొని పెద్దగా అరిచింది సుజాత. నెప్పులు రావడంతో మెలికలు తిరిగిపోతున్న సుజాతను ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మగబిడ్డను ప్రసవించింది.

కాలగర్భంలో రోజులు సంవత్సరాలుగా మారాయి. సుజాతకు ఆడబడుచుల పెళ్లిళ్లు, బాబుని చూసుకోవడంతో క్షణం తీరిక లేకుండా పోయింది.

సుజాత ఆరోగ్యంలో తేడా వచ్చి ఒక్క బాబుకే సంతాన యోగం పోయింది. అనారోగ్యాలు, అవసరాల మధ్య సుజాత మనసులోని కోరిక అడుగున పడిపోయింది. సుజాత, సుందర్‌ల ఏకైక సంతానమైన సురేష్ చదువు పూర్తి కాగానే వివాహం చేసుకొని భార్యతో సహా యు.ఎస్.ఎ. వెళ్లిపోయాడు. సురేష్‌కి పాప పుట్టిందని తెలిసిన నుండి నాయనమ్మ, తాతయ్యలకు మనవరాలిని చూడాలని ఆశ కలిగింది. ఎప్పుడు సురేష్‌ని ఇండియా రమ్మని అడిగినా ఏదో ఒక అడ్డంకి చెబుతూ వాయిదా వేస్తున్నాడు.

సుందర్ అరవయ్యవ జన్మదినాన్ని ఘనంగా జరపాలని సురేష్ ఇండియాలోని తమ బంధుమిత్రులందరికి ఏర్పాట్లు చూడమని తను అప్పటికల్లా వస్తానని చెప్పాడు.

అనుకున్నరోజు రానే వచ్చింది. సురేష్ ఫ్యామిలీ స్టేట్స్ నుండి వచ్చింది. బంధుమిత్రులతో ఇల్లంతా కళకళలాడిపోతుంది. మనవరాలి ఇంగ్లీషు మాటలు సరిగ్గా అర్థం కాకపోయినా మురిపెంగా వింటున్న సుజాతను సుందర్ పిలిచాడు.



"ఈ రోజు నాకెంతో సంతోషంగా ఉంది. నా ఈ ప్రశాంతమైన జీవనానికి కారణం నీవే. ఎప్పుడూ నోరు తెరచి ఏదీ అడగలేదు. నా జన్మదిన సందర్భంగా నీకు నచ్చినదేదయినా ఇవ్వాలని ఉంది. ప్రస్తుతం మనకు ఎటువంటి సమస్యలు లేవు. ఏదయినా సరే అడుగవోయ్" అన్నాడు ప్రేమగా సుజాతతో.

రెండు నిముషాల మౌనం తరువాత "పెళ్లికూతురి బొమ్మ కావాలి" అంది.

"ఏంటి? బొమ్మా?! అప్పుడెప్పుడో ఒకసారి అడిగినట్లున్నావు. అదేనా? నీకు బొమ్మలంటే అంత ఇష్టమా!" అన్నాడు నవ్వుకుంటూ.

"అవును... అసలు ఆ బొమ్మ కావాలనే కోరిక నా బాల్యం నాటిది" అంటూ తను పదవ తరగతిలో ఉండగా మొదటిసారి బొమ్మను చూడటం, కావాలనుకోవడం వివరించింది.

"పిచ్చిదానా! నీవెంత మంచిదానివి. కనీసపు కోరికలు కూడా మనసులో దాచుకున్నావా?" అంటూ "ఇప్పుడే వస్తాను" అని బయటకు వెళ్లాడు సుందర్.

కాసేపటి తరువాత సుందర్ పెద్ద ప్యాకెట్ తీసుకుని వచ్చాడు. బంధువుల మధ్యనున్న సుజాతను పిలిచి తన బహుమతిని ఆమె చేతిలో పెట్టాడు. ప్యాకింగ్‌లో ఉన్న బొమ్మను చూడగానే ఆమె కళ్లు మెరిశాయి. కొడుకు తెచ్చిన డైమండ్ నగల సెట్ చూసినప్పుడు కూడా ఆమెలో అంత ఆనందం సుందర్ చూడలేదు. నెమ్మదిగా ప్యాకింగ్ ఊడదీసిన సుజాత బొమ్మను చూసి ఆనందభాష్పాలతో గుండెలకు హత్తుకుంది.

ఎక్కడ నుండి చూసిందో సురేష్ కూతురు డాలీ "గ్రాండ్ మా! దిస్ టాయ్ ఈజ్ మైన్, నాట్ ఫర్ యు" అంటూ పరుగెత్తుకుంటూ వచ్చి సుజాత చేతిలో నుండి లాక్కుంది.

అంతే! బిత్తరపోయి అలాగే చూస్తుండిపోయింది బొమ్మయిన సుజాత.